శిథిలమవుతున్నా పట్టించుకోరా?

• నిరుపయోగంగా ఓపెన్‌ ఎయిర్‌ ఆడిటోరియం • అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు
• పట్టించుకోని అధికారులు, పాలకులు


శిథిలావస్థలో ఓపెన్‌ ఎయిర్‌ ఆడిటోరియం వేదిక

వనస్థలిపురం నడిబొడ్డులో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం గతంలో హుడా (ప్రస్తుతం హెచ్‌ఎండీఏ) నిర్మించిన ఓపెన్‌ ఎయిర్‌ ఆడిటోరియం శిథిలావస్థకు చేరుకుంది. ఆడిటోరియం వేదిక కళావిహీనంగా మారి, ప్రాంగణమంతా పిచ్చిమొక్కలు, చెత్త, చెదారానికి నిలయంగా మారింది. అటు హెచ్‌ఎండీఏ అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఆడిటోరియం అభివృద్ధికి చొరవ చూపకపోవడంతో భూత్‌ బంగ్లాలా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– వనస్థలిపురం

ప్రాంగణమంతా పిచ్చిమొక్కలే..

వనస్థలిపురంలో స్థానికుల అవసరాల కోసం హుడా ఆధ్వర్యంలో 1998లో ఓపెన్‌ ఎయిర్‌ ఆడిటోరియం నిర్మించారు. అప్పట్లో సాంస్కృతిక ప్రదర్శనలు, పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు, వివిధ కార్యక్రమాల కోసం స్థానికులు ఆడిటోరియాన్ని వినియోగించుకునేవారు. కాలక్రమేణా నిర్వహణ లోపంతో ఆడిటోరియం పూర్తిగా అధ్వాన్నంగా మారింది. ఆడిటోరియం వేదిక పగుళ్లతో, ప్రాంగణమంతా పిచ్చిమొక్కలు, చెత్త చెదారంతో చిట్టడవిని తలపిస్తోంది. ఆడిటోరియానికి అనుబంధంగా ఉన్న గదులు శిథిలమై వాడుకోలేని దుస్థితికి చేరుకున్నాయి.

వ్యాపార సంస్థలకు అద్దెకు..

ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయాల్సిన హెచ్‌ఎండీఏ అధికారులు అటువైపు దృష్టి సారించకపోగా ఆడిటోరియంలోని ఖాళీ స్థలాలను వ్యాపార సంస్థలకు రోజుకు రూ.3000 చొప్పున అద్దెకు ఇస్తూ కాలం గడుపుతున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో ఫంక్షన్లు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకుందామన్న స్థానికులకు ఓపెన్‌ ఆడిటోరియం ఉపయోగపడకుండా పోయింది. గతంలో వనస్థలిపురం నడిబొడ్డులో ప్రజాధనంతో నిర్మించిన ఆడిటోరియం ప్రజావసరాలకు ఉపయోగపడనప్పుడు అది తమ కాలనీలో ఎందుకని వనస్థలిపురం వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి..



వివిధ కార్యక్రమాలకు ఉపయోగపడే హుడా ఓపెన్‌ ఎయిర్‌ ఆడిటోరియం ప్రస్తుతం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయాలని గతంలో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి ఆడిటోరియాన్ని మినీ రవీంద్రభారతి తరహా అభివృద్ధి చేయాలి.

– సంజయ్‌కుమార్, వనస్థలిపురం


పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన ప్రాంగణం


కూలేందుకు సిద్ధంగా గదులు

నేటి నుంచి మూసీ నిర్వాసితులకు రూ.25 వేల పంపిణీ

చాదర్‌ఘాట్: మూసీ నది పక్కన నివసిస్తున్న ఇళ్లు కోల్పోయిన వారికి తాత్కాలిక అవసరాల కోసం శుక్రవారం నుంచి శంకర్‌నగర్‌లో బాధితులకు రూ.25 వేలు అందజేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బలాల వినతి మేరకు కలెక్టర్‌ ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. బాధితుల ఇంటి వద్దే ఆర్థిక సాయం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

హాస్టళ్ల సమస్యలపై కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టికి వినతి పత్రం ఇస్తున్న మహేష్‌కుమార్‌

మలక్‌పేట: నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని సోషలిస్టు స్టూడెంట్‌ అసోసియేషన్‌ (టీఎస్‌ఎస్‌ఏ) నాయకులు గురువారం కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్‌ మాట్లాడుతూ.. హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, అద్దె చెల్లించకపోవడంతో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొనవాల్సి వస్తోందన్నారు. గత ఎనిమిది నెలలుగా మెస్‌ ఛార్జీలు ఇవ్వకపోవడం, ఆరు నెలలుగా హాస్టల్‌ వర్కర్లకు జీతాలు అందడం లేదని కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లారు. హాస్టళ్లకు సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో సమస్యలకు దారి తీస్తుందన్నారు. వసతులు మెరుగు పరిచేలా చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయాలని కోరగా, కలెక్టర్‌ సానుకూలంగా స్పందించారని మహేష్‌ కుమార్‌ తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో మేడి నాగరాజు, నిమ్మల సతీష్, యోగేష్‌ ఉన్నారు.

మూసీ నిర్వాసితులను తరలించేందుకు ఏర్పాట్లు


శాలివాహననగర్‌లో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

మలక్‌పేట: సైదాబాద్‌ మండల పరిధిలో మూసీనది పరీవాహక ప్రాంతవాసులను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్‌ జయశ్రీ తెలిపారు. మూసారంబాగ్‌ మూసీనది తీర ప్రాంతంలో మార్కింగ్‌ చేసిన ఇళ్లను తొలగించేందుకు గురువారం శాలివాహననగర్‌లో పర్యటించి బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ మాట్లాడుతూ.. మండల పరిధిలో శాలివాహననగర్, తీగలగూడలలో 109 మార్కింగ్‌ చేశామని వాటిలో 84 నివాసాలు, మిగిలినవి కమర్షియల్, కిరాయిదారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రతాప్‌సింగారం, జంగంమెట్టు, జియాగూడ, కొల్లూరు, కమలానగర్‌ డబుల్‌ బెడ్‌రూమ్‌ సముదాయాలలోకి పంపించనున్నట్లు తెలిపారు. ఇళ్లను ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉన్న వారి జాబితా తయారు చేసి వారికి పొజిషన్‌ సర్టిఫికెట్‌ అందజేసి వారు కోరుకున్న స్థలానికి పంపిస్తామన్నారు. ఎక్కువ మంది ప్రతాప్‌సింగారం వెళ్లడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం ఖాళీ అయిన వెంటనే వాటి తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మలక్‌పేట పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నీటి కొరత రానివ్వొద్దు


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్‌

నాగోలు: కాలనీ వాసులకు నీటి కొరత రానివ్వొద్దని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ సూచించారు. గురువారం డివిజన్‌ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లోని తాగునీటి సమస్యను ఆయన పరిశీలించారు. బస్తీలో నీరు సరిగ్గా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ ఎత్తులో ఉండటంతో సరఫరా సరిగ్గా జరగడం లేదని నూతన లైన్‌ వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేటర్‌ వెంట రాజు నాయక్, కిషన్, యాదగిరి, తోట మహేందర్‌ యాదవ్‌ ఉన్నారు. అనంతరం కొత్తపేట డివిజన్‌ న్యూ మారుతినగర్, గౌడ్స్‌ కాలనీలో వేస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను ఆయన నాయకులు మంచి రాజేష్, వెంకట్‌రెడ్డి, ఉదయ్, కాలనీ వాసులు, రాజు, సురేష్, అంజయ్యతో కలిసి పరిశీలించారు.

'నూతన ఆర్థిక విధానాలతో కార్మికుల దోపిడీ'


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కార్మికులు

మన్సూరాబాద్: నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలతో ప్రపంచ వ్యాప్తంగా కార్మిక రంగం దోపిడీకి గురవుతుందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి అన్నారు. ప్రపంచ కార్మిక సంఘాల అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవాన్ని గురువారం ఆటోనగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. పెట్టుబడిదారి వర్గం వరస సంక్షోభాలను ఎదుర్కొంటుందని, నూతన మార్కెట్‌ విస్తరణకు దేశాల మధ్య తీవ్ర పోటీ పెరిగి యుద్ధాలు సంభవిస్తున్నాయని తెలిపారు. సామ్రాజ్యవాదానికి యుద్దోన్మాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శ్రమదోపిడీ, సామ్రాజ్యవాదం నశించాలని ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, వీరయ్య, వెంకన్న ,లింగం, చంద్రశేఖర్, లింగస్వామి, శివ, భాస్కర్, నరేష్, సురేష్‌ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరం.. ఆడపడుచుల ఆనందం



దిల్‌సుఖ్‌నగర్‌/మలక్‌పేట: తెలంగాణా సంస్కృతి సంప్రదాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహిళలు, యువతులు అందంగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆడిపాడి సందడి చేశారు.


బతుకమ్మ ఆడుతున్న కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మి


శ్రీపురం కాలనీలో..




నాగార్జున టెక్నో పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

అవార్డు అందజేత


రామచంద్రరావును సన్మానిస్తున్న పీఎస్‌. నారాయణ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: పేదలకు నిరంతరం సేవలు అందిస్తున్న ఎస్‌ఎస్‌ఆర్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ రామచంద్రరావు సేవలు అభినందనీయమని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్‌ పీఎస్‌. నారాయణ అన్నారు. తెలంగాణ గాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో నగరంలో బుధవారం రాత్రి నిర్వహించి మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి సన్మానం చేసి ప్రశంసాపత్రాలను అందజేశారు. రామచంద్రరావు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో భూదాన్‌ సుబ్బారావు, ప్రొఫెసర్‌ సుబ్రహ్మణ్యం, కోదాటి రంగారావు, ప్రముఖ కవి కసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వేదిక్‌ మ్యాథమాటిక్స్‌లో ఉచిత శిక్షణ

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌ ఆర్య సమాజం ఆధ్వర్యంలో వేదిక్‌ మ్యాథమాటిక్స్‌లో రేపటి (శనివారం) నుంచి ఉచిత శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ హ్యూమాన్‌ క్యాలిక్యులేటర్, గిన్నిస్‌ బుక్‌ ఆఫ్‌ వరల్డ్‌ రికార్డ్స్‌ గ్రహీత డాక్టర్‌ బి.సాయికుమార్‌ నాలుగురోజుల పాటు శిక్షణ ఇస్తారన్నారు. చైతన్యపురి క్రాస్‌ రోడ్డుబాదం కాంప్లెక్స్‌లోని ఆర్యవైశ్య సమాజం భవనంలో శిక్షణ ఉంటుందని ఆసక్తి ఉన్న వారు 9505028039 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎల్‌బీనగర్: హయత్‌నగర్‌ సర్కిల్‌ టౌన్‌ ప్లానింగ్‌ ఏసీపీగా టీహెచ్‌ విజయశ్రీ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. హయత్‌నగర్‌ సర్కిల్‌లో పని చేస్తున్న పావనీ బదిలీ కాగా ఆమె స్థానంలో విజయశ్రీ బాధ్యతలు చేపట్టారు. హయత్‌నగర్‌ సర్కిల్‌తో పాటు విజయశ్రీ ఉప్పల్‌ సర్కిల్‌కు కూడా ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించనున్నారు.

నిలిచిపోయిన వికలాంగుల సంక్షేమ పథకాలు

చాదర్‌ఘాట్: రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖలో బడ్జెట్‌ రాక రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాలు నిలిచిపోయాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ ఈ సంవత్సరానికి 2024–2025 రూ.50కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు బడ్జెట్‌ రాకపోవడంతో వికలాంగుల కావాల్సిన మ్యారేజీ ఇన్సెంటివ్, ఈఆర్‌ఎస్, స్కాలర్‌షిప్స్‌ రాక వికలాంగులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బడ్జెట్‌ విడుదలకు ప్రయత్నం చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


పండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: వనస్థలిపురం రైతుబజార్‌ వద్ద పూల,పండ్ల వ్యాపారుల సమస్యలను ప్రభుత్వం , అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. రైతు బజారు వద్ద ట్రాఫిక్‌ సమస్య తలెత్తుతుందని ఇటీవల పూలు, పండ్ల వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న షెడ్లను తొలగించారు. దీంతో గురువారం వ్యాపారులంతా ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. గత 30 ఏళ్లుగా అక్కడే వ్యాపారం చేసుకుంటున్నామని ఇప్పుడు వాటిని తొలగించడంతో రోడ్డున పడే ప్రమాదం ఉందని తమకు న్యాయం జరిగేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు చింతల రవికుమార్, చిరంజీవి, సత్తిరెడ్డి, సతీష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం


కేటీఆర్‌ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మలక్‌పేట: మంత్రి కొండా సురేఖ, సీతక్కలపై బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బషీర్‌బాగ్‌ ప్రెస్‌క్లబ్‌ చౌరస్తాలో గురువారం ఎమ్మెల్యే కేటీఆర్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. మలక్‌పేట నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్‌ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ నాయకులు బషీర్‌బాగ్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. కేటీఆర్‌ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేనిపక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్‌ వెంటనే మంత్రులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో షకీల్, షాహిద్‌ ఖాన్, రాహుల్‌ సింగ్, భాస్కర్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి అమలు కాని హామీలు


నిరసన తెలుపుతున్న నాయకులు


ఎల్‌బీనగర్: అమలు కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ వాటిని అమలు చేయలేక ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి డైవర్షన్‌ రాజకీయాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్‌ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షులు మాధవరం నరసింహారావు ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గురువారం బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వరద బాధితులకు సహాయం చేయడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావుపై వస్తున్న ప్రజాదరణ చూడలేక కాంగ్రెస్‌ గుండాలు దాడి చేశారని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై కొండ సురేఖ వ్యాఖ్యలు కేవలం ప్రజల దృష్టిని మళ్లించేందుకే అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌ పార్టీ నీచ రాజకీయాలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు.ఈ కార్యక్రమంలో హరీష్‌రావు, గిరి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌ యాదవ్, రాము, ఉపేందర్, సాయి, జగపతి రావు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో జీఎస్‌ఐ ఉద్యోగులు

మన్సూరాబాద్: జియోలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా (జీఎస్‌ఐ) ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. యంత్రపూజ, మహాయజ్ఞం, గణపతిపూజ, మహాహారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎస్‌ఐ అడిషినల్‌ డైరెక్టర్‌ జనరల్‌ అండ్‌ హెచ్‌ఓడీ సూరజ్‌ దామోజీ పటభజే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌ హెడ్‌ ఆఫీస్‌ హార్మోహన్‌ మిషరా, శైలేంద్రసింగ్, జీఎస్‌ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ ఆదర్శ మహేష్, రీజినల్‌ సెక్రటరీ మధరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉల్లి @ 60


మలక్‌పేట గంజ్‌లో ఉల్లి నిల్వలు

చాదర్‌ఘాట్: పండగ సీజన్‌లో ఉల్లి ధరలు పెరగడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉత్పత్తి దిగుబడులు అధికంగానే ఉన్నా ధరలు అమాంతంగా పెంచేశారు. గురువారం మలక్‌పేట మార్కెట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి 157 లారీలు వచ్చాయి. క్వింటాల్‌కు హోల్‌సేల్‌గా రూ.4200 కాగా బయట మార్కెట్‌ కిలో రూ.60 అమ్ముతున్నారు. కొత్త ఉల్లిగడ్డ క్వింటాల్‌కు రూ.3100 ఉండగా బయట రిటైల్‌గా రూ.50 అమ్ముతున్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా పండగ నేపథ్యంలో ధరలు పెంచుకుంటున్నారని వెల్లడించారు.

దుర్గమ్మా.. దీవించమ్మా



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మొదటిరోజు గురువారం అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆయా మండపాల్లో ప్రతిష్టించిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


మాతామైదాన్‌లోని అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ


పోచమ్మ దేవాలయంలో దుర్గామాతకు పూజలు నిర్వహిస్తున్న విఠల్‌రెడ్డి


విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో..


సలీంనగర్.. అమ్మవారికి పూజల్లో పాల్గొన్న భక్తులు


గ్రీన్‌ హిల్స్‌ కాలనీలో కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి


శ్రీ ప్రత్యంగిరా దేవి దేవాలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు


కొత్తపేట ప్రసన్న మహాకాళి దేవాలయంలో పూజలో పాల్గొన్న దేవాలయ ట్రస్ట్‌ చైర్మన్‌ వజీర్‌ ప్రకాష్‌గౌడ్‌